క్లుప్తంగా

కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు ప్రారంభం



ఆపరేషన్ చేస్తున్న డిప్యూటి డీఎంహెచ్‌ఓ సుజన

దర్శి (కురిచేడు): చందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నుంచి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు ప్రారంభించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజనా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు సుజనా, బ్లెస్సీలు ఆరుగురు మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు విజయవంతంగా చేశారు. బ్లెస్సీ తన సొంత ఖర్చులతో ఆరుగురికి పండ్లు, భోజనాలు ఏర్పాటు చేశారు. వైద్యులు శ్రీనివాసులు, సురేఖ, సీహెచ్‌ఓ దయామణి, హెచ్‌ఈఓ శ్రీనివాసులు, స్టాఫ్‌నర్స్ ఉషారాణి, పుల్లారావు, వసంతకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలు వెంటనే పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి

యర్రగొండపాలెం: అర్జీదారులు తమ సమస్యలపై ఇచ్చిన వినతులను వెనువెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి ఆదేశించారు. గురువారం మండల గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా ఇన్‌కం, క్యాస్ట్ సర్టిఫికెట్ల అర్జీలను క్లియర్ చేయాలని, ఆ సర్టిఫికెట్‌ల కోసం అర్జీదారులు రోజూ కార్యాలయం చుట్టు తిరగకుండా చూడాలన్నారు. రేషన్ కార్డులకు సంబంధించిన 7 సర్వీసులపై అవగాహన పెంచుకొని తదనుగుణంగా వారికి సేవలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జీఎస్‌డబ్ల్యూఎస్‌లో సర్వీసులు దరఖాస్తు దారులు అప్లయ్ చేసిన తర్వాత వారు మళ్లీ ఆఫీసుకు రాకుండా ఆ సర్వీసులను పరిష్కరించాలని, ప్రజలు పిడుగుపాటుకు గురికాకుండా వారిలో అవగాహన పెంచాలని ఆయన ఆదేశించారు.

గ్రహణమొర్రికి ఉచిత శస్త్ర చికిత్స

మార్కాపురం: గ్రహణమొర్రికి ఉచిత శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్(ఆర్‌బీఎస్‌కే)ప్రతినిధులు తెలిపారు. గురువారం స్థానిక జీజీహెచ్‌లో పిన్నమనేని సిద్దార్థ కాలేజీ, స్మైల్ టైమ్ ఫౌండేషన్ సహకారంతో డాక్టర్ ఎన్.కోటేశ్వరరావు, డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గ్రహణమొర్రి గల పిల్లలు 13 మందిని పరిశీలించారు. బాధిత చిన్నారులు జీజీహెచ్‌లో సంప్రదించి ఉచిత సేవలు పొందవచ్చని దంత వైద్యుడు డాక్టర్ శ్రీహరి తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌డీఓ కార్యాలయానికి స్థల పరిశీలన

మార్కాపురం: మార్కాపురం పీఆర్ అతిథి గృహం వద్ద డీఎల్‌డీఓ కార్యాలయ భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని జెడ్పీ సీఈఓ చిరంజీవి గురువారం స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం డీఎల్‌డీఓ కార్యాలయం ఎంపీడీఓ ఆఫీసులో ఒక గదిని కేటాయించారు. శాశ్వతంగా భవన నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి స్థల పరిశీలన చేసినట్లు సీఈఓ తెలిపారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఏఈ మోహన్‌రాజు, డీఎల్‌డీఓ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

రక్తదానంలో హాఫ్ సెంచరీ

కొమరోలు: రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఆపదలో ఉన్నవారికి స్వయంగా రక్తదానం చేస్తూ మన్ననలు అందుకుంటున్నాడు కొమరోలు మండలంలోని నల్లగుంట్ల గ్రామానికి చెందిన చల్లా అశోక్‌రెడ్డి. గత 13 ఏళ్లుగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ యువతను ప్రోత్సహిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో వైద్యశాలలో ఓ మహిళకు అత్యవసరంగా గుండె ఆపరేషన్‌కు రక్తం అవసరం కాగా మేమున్నాం సేవా సమితి ఆధ్వర్యంలో చల్లా అశోక్‌రెడ్డి 50వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డిని పలువురు అభినందించారు.

ఆటో, కారు ఢీ.. ముగ్గురికి గాయాలు

మార్కాపురం టౌన్: మార్కాపురం చెరువుకట్టపై గురువారం వేకువజామున ఆటో, కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. పట్టణ పోలీసుల కథనం మేరకు.. మార్కాపురం నుంచి రైల్వేస్టేషన్‌కు ఆటో వెళ్తుండగా, అదే సమయంలో ఒంగోలు నుంచి మార్కాపురం వైపు వస్తున్న కారు చెరువు కట్ట వద్ద ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ పానకాల సాయి, దొంతిరెడ్డి సూర్య ప్రతాప్‌రెడ్డి, వెంకటరావమ్మకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ పోలీసులు తెలిపారు.

రుచికి దూరంగా మధుర ఫలం

- మామిడిని కృత్రిమంగా మగ్గబెడుతున్న వ్యాపారులు
- రసాయనాలతో మగ్గిన పండ్లు తినొద్దంటున్న వైద్యులు



నోరూరించే మామిడి కాయలు

పెద్దదోర్నాల:

ప్రస్తుతం మార్కెట్లను మామిడి పండ్లు ముంచెత్తుతున్నాయి. ఫలాల్లో రాజైన ఈ మధుర ఫలాన్ని కాస్తంత ఖరీదైనా కంటికి నచ్చడంతో ఎంత ధరైనా చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. తీరా వాటి రుచి చూశాక చప్పగా ఉంటుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సహజ సిద్ధంగా కాకుండా కృత్రిమ పద్ధతుల ద్వారా మామిడి పండ్లను మగ్గపెట్టడమే దీనికి ప్రధాన కారణం కావడంతో వినియోగదారులు అమ్మకందార్లను మనసులోనే నిందిస్తున్నారు. మామిడి కాయలు మగ్గపెట్టేందుకు అనుమతి ఉన్నా ఇథిలిన్‌ను నిబంధనల ప్రకారం వినియోగించటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలో కొందరు వ్యాపారులు లాభాపేక్షతో కాయలు పక్వానికి రాకముందే చెట్ల నుండి కోసి మార్కెట్లకు తరలిస్తున్నారు. వీటిని రసాయనాలతో మగ్గించి ఒక్క రోజులోనే పసుపు రంగు తెప్పించి విక్రయాలు చేస్తున్నారు. ఇటువంటి కాయలు రుచి, వాసన, నాణ్యత ఉండక పోగా తొందరగా కుళ్లి పోవటం, నాణ్యత లేక పోవటం జరుగుతుంటాయి. సహజ సిద్ధంగా మగ్గబెట్టే పండ్లలో రంగు, రుచికి ఎదురుండదు. ప్రస్తుత పరిస్థితుల్లో దిగుబడులు పెరగక ముందే తోటలను కాంట్రాక్టుల ద్వారా పొందిన వ్యక్తులు వారి ఇష్టానుసారం సరఫరా చేస్తున్నారు. ఇటువంటి కాయలు మగ్గేందుకు చాలా సమయం పట్టే అవకాశం ఉండటంతో రసాయనాలు వినియోగించి వాటిని అమ్మకానికి పెడుతున్నారు. ఇథలిన్‌ను నీటిలో కలిపి పండ్లపై చల్లుతున్నారు. ఇటువంటి పండ్లు తింటే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ లావణ్య పేర్కొంటున్నారు. మగ్గించే సమయంలో సబ్బు పెట్టెలాంటి దానిలో రసాయనం ఉంచి 20 కిలోలకు ఒక పెట్టె లాంటిది ఏర్పాటు చేస్తారని, తద్వారా 24 గంటల అనంతరం దాన్ని తొలగించటం ద్వారా పండ్లను కృత్రిమంగా మగ్గబెడతారన్న ఆరోపణలు వస్తున్నాయి.

> **అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంది:**
> సహజ సిద్ధంగా కాకుండా రసాయనాలతో మగ్గించిన పండ్లు తింటే శరీరంలోని అవయవాలకు ఆక్సిజన్ అందక అవి చచ్చుబడే ప్రమాదం ఉంది. రక్తహీనత, మూత్రపిండాలు, కాలేయం వంటి అవయవాలు దెబ్బతినటంతో పాటు చర్మ వ్యాధులు వచ్చే ప్రమాదం లేకపోలేదు.
> డాక్టర్ లావణ్య, ప్రభుత్వ వైద్యాధికారి, పెద్దదోర్నాల

వైఎస్సార్ సీపీ నేతలకు ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ



రామకృష్ణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి



సుబ్బారత్నం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మండలంలోని తూర్పు గంగవరం గ్రామానికి చెందిన దర్శి నియోజకవర్గ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు జక్కుల రామకృష్ణను పరామర్శించారు. ఆయన ఇటీవల కాలుకు ఆపరేషన్ చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అతడిని గురువారం పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు యాడిక యలమందారెడ్డి సతీమణి సుబ్బారత్నం దశ దిన కర్మకు హాజరై ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని ధైర్యం నింపారు. పార్టీ మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, దర్శి మండల పార్టీ అధ్యక్షుడు వెన్నపూస వెంకట్‌రెడ్డి, కుమ్మిత జయరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై పోలీసు జులుం తగదు



వై.పాలెంలో సీఐ ప్రభాకరరావుకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు



వై.పాలెం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకుడు చెన్నయ్య, జర్నలిస్టులు

- సీపీఐ సీనియర్ నాయకుడు చెన్నయ్య

యర్రగొండపాలెం: ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానకర్తలుగా పనిచేసే జర్నలిస్టులపై పోలీసు జులుం తగదని సీపీఐ సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య అన్నారు. గురువారం విజయవాడలో సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి నివాసంలో నగర సెంట్రల్ ఏసీపీ దామోదర్, మాచవరం సీఐ ప్రకాష్‌లు తమ సిబ్బందితో అక్రమంగా ప్రవేశించి సోదాలు చేసినందుకు నిరసనగా ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో స్థానిక జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ర్యాలీగా వెళ్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకరరావు, మండల రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ కృష్ణలకు వినతి పత్రాలు అందచేశారు. చెన్నయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, అక్రమాలను వెలికితీసి ప్రజల ముందుంచడమే ఎడిటర్ ధనుంజయరెడ్డి చేసిన నేరమా..అని ప్రశ్నించారు. పోలీసులు పత్రికారంగంపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదన్నారు. ముందుగా జర్నలిస్టులు ర్యాలీగా పోలీస్ స్టేషన్, మండల రెవెన్యూ కార్యాలయాల వద్దకు వెళ్లారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసులు దాడి చేయడం సిగ్గుచేటని, ఖాకీలను అడ్డుపెట్టుకొని జర్నలిజాన్ని నియంత్రించలేరని, పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచినట్లేనని, భయపెట్టి నిజాలను అడ్డుకోలేరని, అక్రమ కేసులకు జర్నలిస్టులు బెదరరంటూ నినాదాలు చేశారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఏపీయూడబ్ల్యూజే మాజీ జిల్లా అధ్యక్షుడు షేక్ నూరుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్ మహబూబ్‌బాషా, జర్నలిస్టులు పి.అయూబ్‌ఖాన్, ఎస్.వెంకోబరావు, ఎ.సత్యనారాయణరెడ్డి, ఆర్.శంకర్‌నాయక్, షేక్ రియాజ్, పి.వెంకటనారాయణ, కె.శంకర్, ఎ.అనిల్ పాల్గొన్నారు.

ఎవరెన్ని ఇబ్బందులు పెట్టినా జగన్‌తోనే పయనం

- ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



బొట్లపాలెం ప్రభపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి, వేదికపై వెంకాయమ్మ

దర్శి (కురిచేడు): ఎన్ని రెడ్‌బుక్ రాజ్యాంగాలు అమలు చేసినా, ఎవరెన్ని ఇబ్బందులు పెట్టినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే తామంతా..అంటూ ప్రజలు అండగా నిలిచారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి నియోజకవర్గ శాసన సభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బొట్లపాలెంలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన సందర్భంగా బుధవారం వైఎఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై నుంచి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు సేవ చేస్తామని అధికారంలోకి వచ్చి అరాచకాలు సృష్టిస్తున్నా ప్రజలు భయపడకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటున్నారని బూచేపల్లి పేర్కొన్నారు. రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వార్గాల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహనరెడ్డికే దక్కుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటకోసం ఎన్ని కష్టాలు ఎదురైనా లెక్క చేయకుండా ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటిని కూడా అమలు చేసి నేడు దేశమంతా వాటిని అనుసరించే విధంగా ఆ పథకాలు ఉన్నాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు పెట్టుబడి సాయంతో పాటు గిట్టుబాటు ధరలు ఉండి ఆనందంగా ఉన్నారని, నేడు రైతులు అప్పులపాలై గిట్టుబాటు ధరలు లేక, పెట్టుబడి సాయం అందక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆయన గుర్తుచేశారు. త్వరలో రాజన్న రాజ్యం, జగనన్న పాలన మళ్లీ వస్తుందని, ప్రజలు ధైర్యంగా ఉండాలన్నారు. ఎన్నికల ముందు మహిళలకు ఉచిత బస్సు, యువతకు నిరుద్యోగ భృతి అన్న చంద్రబాబు నాయుడు ఎవరికి ఏం చేయకపోయినా తన కుమారుడికి మంత్రి పదవి ఇచ్చుకున్నాడని ఎద్దేవా చేశారు. పేదల కోసం చంద్రబాబు ఏం చేయలేదని ఎమ్మెల్యే బూచేపల్లి జోస్యం చెప్పారు. సంపద సృష్టించటం తనకు చేతకాదని ఇటీవల ఓ సమావేశంలో చంద్రబాబు చెప్పటం ఆయన చేతకాని తనాన్ని ఆయనే బయట పెట్టుకున్నారన్నారు. పేద ప్రజలు బాగుపడాలన్నా, అక్కా చెల్లెళ్లు సంతోషంగా ఉండాలన్నా ఒక్క జగనన్న పాలనలోనే అది సాధ్యమని పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో అందరం కలిసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని అభివృద్ధి పథంలో ముందుకు సాగుదామని ఎమ్మెల్యే బూచేపల్లి పిలుపునిచ్చారు.



హాజరైన అశేష ప్రజానీకం

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు



మాట్లాడుతున్న పీహెచ్‌సీ స్టాఫ్‌నర్సు గౌతమి

పెద్దారవీడు: గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందని స్థానిక పీహెచ్‌సీ స్టాఫ్ నర్సు గౌతమి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎండల బారిన పడకుండా గ్రంథాలయాలకు వెళ్తే ఉపయోగంగా ఉంటుందన్నారు. ఆరోగ్య సుత్రాలు తెలియజేస్తూ దంతాలు ఏ విధంగా బ్రష్ చేసుకొని శుభ్రంగా ఉంచుకోవాలో వివరించారు. గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదివిన నీతి కథలను విశ్లేషించడం, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించారు. విద్యార్థుల ఉన్నత స్థాయికి ఎదిగేందుకు గ్రంథాలయాలు దోహదం చేస్తాయన్నారు. గ్రంథాలయంలో నిర్వహించే శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 25 మంది బాలబాలికలు పాల్గొన్నారు.

లోకోస్ ఆర్థిక లావాదేవీలపై శిక్షణ



మాట్లాడుతున్న ఏపీఎం వెంకటేశ్వర్లు

దొనకొండ: స్థానిక స్త్రీ శక్తి కార్యాలయంలో ఏపీఎం జి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లోకోస్ ఆర్థిక లావాదేవీలపై గురువారం శిక్షణ ప్రారంభమైంది. శిక్షణ రెండు రోజుల పాటు ఉంటుంది. శిక్షణకు దర్శి ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్ఆర్ఎల్ఎం ద్వారా లోకోస్‌లో భాగంగా గ్రూపులు, వీఓఏలు, ఎంఎస్‌లు ఎలా నడుచుకోవాలి, ఆర్థిక వ్యవహారాల్లో ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్, ఏ రీతిగా డేటా ఎంట్రీ చేయాలనే అంశంపై శిక్షణ ఇవ్వనున్నారు. గ్రూపులో ఉన్న మహిళలకు ఆర్థిక లావాదేవీలు సంబంధించిన నిల్వలు లోకోస్ యాప్‌లో ట్రాన్సాక్షన్ ఎంట్రీ డేటా నమోదు ఎలా చేయాలో శిక్షణ ఇవ్వనున్నారు. మండల సమైక్య అకౌంట్లు ఎలా చేయాలి, ఏ రీతిలో చేయాలి తదితర విషయాలపై మహిళలకు సంపూర్ణంగా శిక్షణ ఇస్తారు. దర్శి మండల ఏపీఎం నజియా బేగం, సీసీలు, ముండ్లమూరు మండలం సీసీలు, వీఓఏలు, కురిచేడు మండలం సీసీలు శిక్షణకు హాజరయ్యారు.

తాళ్లూరు మండలంలో జేసీ పర్యటన



సబ్‌స్టేషన్ వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ గోపాలకృష్ణ

తాళ్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ గురువారం విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా శివరాంపురంలో నిర్మాణ దశలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు శరవేగంగా పూర్తి చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం బెల్లంకొండవారిపాలెంలో రీ సర్వేకు హాజరై రైతులకు పాస్ పుస్తకాల్లో తప్పిదాలు లేకుండా చూసి ప్రభుత్వ పథకాలు వారికి అందేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. ఆ తర్వాత తూర్పు గంగవరంలో మల్లికార్జున రైస్ మిల్లును తనిఖీ చేశారు. జేసీ గోపాలకృష్ణ వెంట తహసీల్దార్ సంజీవరావు, మండల అధికారులు ఉన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి



సీపీఐ నూతన కమిటీ సభ్యులు

యర్రగొండపాలెం: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ. 2 వేల కోట్లు నిధులు కేటాయించి కరువుతో అలమటిస్తున్న పశ్చిమ ప్రాంతానికి నీటిని విడుదల చేసి ఆదుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పూల సుబ్బయ్య భవన్‌లో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మన్నె సాంబశివరావు, సహాయ కార్యదర్శులుగా నక్కా తిరుపతయ్య, వై.వెంకటశివయ్యలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్ట్‌తో పాటు టీ5 కాలువను పుల్లల చెరువు మండలంలోని చిన్నకండలేరు వరకు పొడిగించి అందుకు కావాల్సిన నిధులను ప్రభుత్వం కేటాయించాలని కోరారు. యర్రగొండపాలెం ప్రాంతంలో విస్తారంగా ఉద్యాన పంటలు పండిస్తున్నారని, ఆ ఫలాలను సుదూర ప్రాంతాలకు తీసుకొని వెళ్లి మార్కెటింగ్ చేయడం రైతులకు కష్టంగా ఉందని, వెంటనే జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కోరారు. యర్రగొండపాలెం నుంచి త్రిపురాంతకం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

ముండ్లమూరులో కుంభవృష్టి




జోరుగా కురుస్తున్న వాన

ముండ్లమూరు (కురిచేడు): ముండ్లమూరు మండలంలో గురువారం సాయంత్రం ఆకస్మికంగా జోరు వాన కురిసింది. గాలీవాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులకు పాకలు లేచిపోయాయి. రేకులు లేచి పోయాయి. చెట్లు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇటీవల కాలంలో ఇంతటి వర్షాన్ని చూడలేదని రైతులు పేర్కొన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభించుకునేందుకు అనుకూలంగా ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జర్నలిస్టలపై రెడ్‌బుక్ రాజ్యాంగమా?

- సీపీఐ సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య



టీసీహెచ్ చెన్నయ్య

యర్రగొండపాలెం: కూటమి ప్రభుత్వం జర్నలిస్ట్‌లపై రెడ్ బుక్ రాజ్యాంగం అమలు పరచడం సిగ్గుచేటని సీపీఐ సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై తన కలం ఝులిపిస్తున్నారన్న భయంతో సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిపై కేసులు నమోదు చేయడం, ఏకంగా ఆయన ఇంటిపైకి పోలీసులను పంపించి తనిఖీలు చేయించడం, గంటకుపైగా ఆయన నివశిస్తున్న అపార్టుమెంటులో భయానక వాతావరణం సృష్టించడం అన్యాయమన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఇతర కేసుల్లో ముద్దాయిలు అపార్టుమెంటులో ఉన్నారని, తనిఖీల్లో భాగంగా వచ్చామని పోలీసులు బుకాయించడం సిగ్గుచేటన్నారు. ధనుంజయరెడ్డి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడంతో పాటు సమాజంలో పరువు, ప్రతిష్టలకు విఘాతం కలిగించే విధంగా పోలీసులు ప్రవర్తించారని మండిపడ్డారు. అన్ని రంగుల పుస్తకాలు వడపోసిన జర్నలిస్టులు రెడ్ బుక్‌కు భయపడతారని ప్రభుత్వం భావించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇటువంటి రెడ్ బుక్‌లకు జర్నలిస్టులు అదరరు, బెదరరన్నారు. ప్రజల పక్షాన నిలిచి వారి సమస్యలను అక్షర రూపంలో ప్రభుత్వానికి చేరవేస్తునే ఉంటారన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకొని జర్నలిజాన్ని నియంత్రించాలన్న ఆలోచనకు కూటమి ప్రభుత్వం స్వస్తి చెప్పాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని చెన్నయ్య హెచ్చరించారు.